


శాసనసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్


ప్రజల మధ్య విభేదాలకు కేంద్రం కుటిల యత్నం

- హిందీ మాట్లాడని రాష్ట్రాలపై కక్ష సాధింపు
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి స్టాలిన్
- వక్ఫ్ బోర్డు ముసాయిదా చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం
- బీజేపీ మినహా అన్ని పార్టీల ఆమోదం

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య విభేదాలకు బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తోందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీ ముస్లిం వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేసే 1995 వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించేలా 2024 ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు చట్టం ముసాయిదా సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఉదయం శాసనసభలో ఓ ప్రత్యేక తీర్మానం చేశారు. ముస్లింల మనుగడను దెబ్బతీసే ఈ బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ తీర్మానం ప్రవేశపెడుతున్న సందర్భంగా సీఎం మాట్లాడుతూ, భారత దేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ప్రజల మధ్య సమైక్యతను చాటిచెబుతోందని, విభిన్న జాతులు, భాషలు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ అందరూ భారతీయులమనే భావంతోనే ఐకమత్యంగా జీవిస్తున్నారన్నారు. ఇంతటి విశిష్టతను కలిగిన దేశాన్ని పాలించేవారు కూడా ఆ భావనతోనే వుండాలన్నారు. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని చెడకొట్టేలా వర్గాల మధ్య విభేదాలను సృష్టించే కుటిల ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఆ దిశగానే తొలుత పౌరసత్వసవరణ చట్టం పేరుతో ముస్లింలను, శ్రీలంక తమిళులకు తీరని నష్టాలను కలిగించిందని విమర్శించారు. నిర్బంధ హిందీ అమలు చేసి, హిందీ మాట్లాడని రాష్ట్రాలపై కక్షసాధింపు చర్యలు చేపడుతోందని, బీజేపీయేతర పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాలలో నిధులివ్వకుండా సంక్షోభంలో నెట్టివేస్తోందని ఆరోపించారు. నీట్, జాతీయ విద్యావిధానం అట్టడుగు వర్గాల విద్యార్థులకు ఎలా నష్టాన్ని కలిగిస్తోందో అందరికీ తెలిసిన విషయమేనని, ఆ వరుసలోనే వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లు మైనారిటీ ముస్లింల ఉనికికే ప్రమాదం కలుగుతుందన్న కారణంగా డీఎంకే ఆ ముసాయిదా బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. గత యేడాది ఆగస్టు 8న వక్ఫ్ ముసాయిదా చట్ట సవరణను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని, ఆ బిల్లును ప్రధాన ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకించడంతో ఆ బిల్లును పార్లమెంట్ ఉమ్మడి వ్యవహారాల కమిటీ పరిశీలనకు పంపారని స్టాలిన్ వివరించారు. ఈ చట్ట సవరణ జరిగితే జాతీయ వక్ఫ్ బోర్డులోనూ, రాష్ట్రీయ వక్ఫ్‌బోర్డులోనూ కేంద్రప్రభుత్వ అజమాయిషీ పెరుగుతుందని, వక్ఫ్ తీరుతెన్నులే మారిపోతాయన్నారు. వక్ఫ్ బోర్డుకు చెందిన భూములన్నీ కేంద్ర ప్రభుత్వ పరమవుతాయని, అంతే కాకుండా ఐదేళ్లకు తగ్గకుండా ముస్లిం మతాన్ని అనుసరించే వ్యక్తి మాత్రమే వక్ఫ్‌ను ప్రకటించాలని నిర్బంధానికి గురిచేస్తుందన్నారు. ముస్లింలలో ఉన్న రెండు తెగల మధ్య ప్రైవేటుగా ఆస్తుల సంస్థ రూపొందించటానికి ప్రయత్నాలు చేస్తారని ఆరోపించారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డుల్లో ముస్లిం మతానికి చెందిన ఇద్దరిని సభ్యులుగా చేర్చేందుకు ఈ సవరణ చట్టం అనుమతిస్తుందని, అదే జరిగితే రాష్ట్ర వక్ఫ్ బోర్డులు నిర్వీర్యమైపోతాయని తెలిపారు. వక్ఫ్‌బోర్డు చట్టం సెక్షన్ 40ని తొలగించడంతో వక్ఫ్ ఆస్తులు తమ గుర్తింపును కోల్పోయి ప్రభుత్వ ఆస్తులుగా మారే అవకాశం ఉందన్నారు. ఇది రాజ్యాంగంలోని సెక్షన్ 26 ప్రకారం మతస్వాతంత్ర్యాన్ని ఉల్లఘించడమే అవుతుందన్నారు. ఈ వివరాలను గత యేడాది సెప్టెంబర్ 30న పార్లమెంట్ ఉమ్మడి వ్యవహారాల కమిటీకి తమ పార్టీ ఎంపీలు వివరించారని చెప్పారు. ఈ ముసాయిదా చట్ట సవరణకు ప్రధాన ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ఆ కమిటీ పూర్తిగా తిరస్కరించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఈ సవరణ చట్టానికి కేంద్రం మంత్రివర్గం ఆమోదం తెలుపటంతో ఏ క్షణంలోనైనా ఈ ముసాయిదా చట్ట సవరణను పార్లమెంట్‌కు వస్తుందని చెప్పారు. ముస్లింల మనుగడకే ముప్పు కలిగించే ఈ ముసాయిదా చట్ట సవరణను తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకే శాసనసభలో ఆ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ తాను ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ తీర్మానాన్ని అన్ని పార్టీల సభ్యులు ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తీర్మానాన్ని బీజేపీ మినహా అన్ని పార్టీలు ఆమోదించాయి.

బీజేపీ సభ్యుల వాకౌట్

ఈ తీర్మానాన్ని బీజేపీ వ్యతిరేకించింది. బీజేపీ శాసన సభ సభ్యురాలు వానతి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ తీర్మానం ప్రవేశపెట్టారని తెలిపారు. దీనిని తాము నిరశిస్తూ సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.



నేడు చెన్నైకి చంద్రబాబు

ఉదయం 10.30 గంటలకు విమానాశ్రయానికి చేరిక

'మద్రాస్ ఐఐటీ' కార్యక్రమానికి హాజరు

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం చెన్నై రానున్నారు. అడయార్‌లోని 'మద్రాస్ ఐఐటీ'లో ఉదయం 11 గంటలకు జరుగనున్న 'ఆలిండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్-2025'లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఇందుకోసం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10.30 గంటలకు రానున్న చంద్రబాబుకు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ కార్యకర్తలు, అభిమానులు సిద్ధమవుతున్నారు. కాగా మీనంబాక్కంలోని పాత విమానాశ్రయంలో వీఐటీ గేట్ (6వ నెంబరు గేట్) నుంచి చంద్రబాబు బయటకు రానున్నారు. ఇదిలా ఉండగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి చెన్నై వస్తున్న చంద్రబాబుకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులంతా తరలిరావాలని చెన్నై టీడీపీ అధ్యక్షులు చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. తిరిగి మధ్యాహ్నం 2.30 గంటలకు చంద్రబాబు మద్రాస్ ఐఐటీ నుంచి విమానాశ్రయం చేరుకుని, విజయవాడ బయలుదేరి వెళ్లనున్నారు.

గ్యాస్ ట్యాంకర్ల సమ్మె ప్రారంభం

- ఆగిన 6,000 లారీలు



ప్యారీస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ చమురు సంస్థ హిందూస్థాన్ పెట్రోలియంతో కుదుర్చుకున్న ఒప్పందాలను సడలించని కారణంగా రాష్ట్రంలోని ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానులు గురువారం సమ్మె బాటపట్టారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల సౌత్‌జోన్ ఎల్పీజీ ట్యాంకర్ లారీల యజమానుల సంఘం రాష్ట్రంలోని నామక్కల్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రజాశాఖలోని ఆయిల్ సంస్థల యూనిట్లకు వంట గ్యాస్ తీసుకెళ్ళేందుకు ట్యాంకర్ లారీలను వినియోగిస్తున్నారు. ఆ మేరకు ఆయిల్ సంస్థలతో రాష్ట్రంలోని ట్యాంకర్ లారీల యజమానులు 2025 నుండి 2030 వరకు కుదుర్చుకున్న ఒప్పందంలోని కఠిన నిబంధనలు సడలించాలని సౌత్ జోన్ ఎల్పీజీ ట్యాంకర్ల యజమానుల సంఘం అధ్యక్షుడు సుందరరాజన్ పలుమార్లు చమురు సంస్థల అధికారులకు విజ్ఞప్తిచేసినా ఫలితం లేదని తెలిసింది. సుందరరాజన్ గురువారం నుంచి సమ్మెబాట పట్టనున్నట్లు ప్రకటించారు. ఇందువల్ల ఉదయం 6గంటల నుండి సుమారు 6,000కు పైగా గ్యాస్ ట్యాంకర్ లారీలు ఆగిపోయాయి. అందువల్ల ఆయిల్ సంస్థల యూనిట్లకు తీసుకెళ్ళే వంట గ్యాస్ పూర్తిస్థాయిలో స్తంభించింది. సమ్మె ఇలాగే కొనసాగితే వంటగ్యాస్ కొరత ఏర్పడే అవకాశముందని ఈ సమస్యను తక్షణం పరిష్కరింపజేయాలని ప్రజలు కేంద్రాన్ని కోరుతున్నారు.

ఓపీఎస్‌ను చేర్చుకునేది లేదు

- మరోమారు స్పష్టం చేసిన ఈపీఎస్



కరుప్పసామి పాండ్యన్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి తదితరులు

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పార్టీకి పలు విధాలుగా నష్టం చేకూరుస్తూ ద్రోహం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)ను మళ్ళీ పార్టీలో చేర్చుకునే ప్రసక్తేలేదని అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మరోమారు స్పష్టం చేశారు. తూత్తుకుడిలో బుధవారం మృతిచెందిన మాజీ ఎమ్మెల్యే కరుప్పసామి పాండ్యన్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు గురువారం ఉదయం వెళ్లిన ఈపీఎస్.. విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతూ... ఇటీవల ఢిల్లీలో అమిత్ షాను కలుసుకున్న సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరానని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్‌ను మళ్ళీ పార్టీలో చేర్చుకోవాలంటూ తనపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయన్ని పార్టీలో చేర్చుకునే ప్రసక్తేలేదన్నారు. పార్టీకి ద్రోహం చేసి పార్టీని శత్రువుల దగ్గర తాకట్టు పెట్టేందుకు ప్రయత్నించిన ఓపీఎస్‌ని ఎలా పార్టీలో చేర్చుకోగలమని ప్రశ్నించారు. ప్రస్తుతం అన్నాడీఎంకేలో చేరుతున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం జరుపుతున్న దాడులను, అక్రమ నిర్బంధాలను శాశ్వతంగా అడ్డుకునే దిశగా కేంద్రప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు.

ఈపీఎస్‌తో కాదనుకుని..

తూత్తుకుడిలో అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యుడు కరుప్పస్వామి పాండ్యన్ భౌతికకాయం వద్ద నివాళులర్పించేందుకు వెళ్ళిన మాజీ ముఖ్యమంత్రులు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) తిరుగు ప్రయాణంలో ఒకే విమానంలో రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇద్దరూ ఒకే విమానంలో టిక్కెట్లు రిజర్వ్ చేసుకోవడంతో అన్ని వర్గాలు వారి ప్రయాణంపై ఉత్కంఠతో ఎదురు చూశాయి. అయితే ఈ విషయం తెలుసుకున్న ఓపీఎస్ తూత్తుకుడి నుంచి మదురై వరకు రోడ్డుమార్గంలో వచ్చి, అక్కడి నుంచి చెన్నైకి విమానంలో వచ్చారు.

నేటినుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

సర్వం సిద్ధం చేసిన ప్రభుత్వం ● హాజరుకానున్న 9.13 లక్షల మంది విద్యార్థులు ● పరీక్ష కేంద్రాల్లో నిఘా

ప్యారీస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్యప్రణాళికలో టెన్త్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9.13 లక్షల మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేలా ప్రభుత్వ పరీక్షల శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. 2024-25వ విద్యా సంవత్సరానికి సంబంధించి 12,487 పాఠశాలలకు చెందిన 4,46,411 మంది విద్యార్థులు, 4,40,499 మంది విద్యార్థినులు, 25,888 మంది ప్రైవేటు విద్యార్థులు, 273 మంది ఖైదీల సహా మొత్తం 9,13,0884 మంది టెన్త్ పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం పాఠశాలల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా 4,113 పరీక్షా కేంద్రాలు



పరీక్ష కేంద్రంలో నెంబర్లు వేస్తున్న సిబ్బంది

ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లో సుమారు 48,426 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించనుండగా, పరీక్షల్లో అవకతవకలు జరగకుండా 4,850 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటయ్యాయి. ఏప్రిల్ 15వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

పరీక్ష కేంద్రాల్లో నిబంధనలు...

ఉదయం 10గంటల ముందే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని, ఆ తర్వాత అనుమతించేది లేదని విద్యాశాఖ హెచ్చరించింది. పరీక్షా కేంద్రాల ప్రాంగణాల్లోకి విద్యార్థులు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించగా, విధుల సమయంలో ఉపాధ్యాయులు కూడా సెల్‌ఫోన్ వాడకంపై నిషేధం విధించారు. పరీక్ష కేంద్రాల వద్ద త్రాగునీరు, టాయిలెట్లతో పాటు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. కాగా, పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించిన విద్యుత్ బోర్డు, ఆ కేంద్రాల వద్ద ఉద్యోగులను నియమించింది.

దివ్యాంగ విద్యార్థులకు...

15,729 మంది దివ్యాంగ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అదనంగా ఒక గంట సదుపాయం కల్పించినట్లు పాఠశాల విద్యా శాఖా మంత్రి అన్బిల్ మహేష్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో జిల్లా స్థాయి కమిటీని ఈ పరీక్షల కోసం నియమించినట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించిన వివరాలను 9498383075 లేదా 9498383076 అనే పరీక్షల కంట్రోల్ బోర్డుతో సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

ప్రశాంత వాతావరణంలో...

పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు పాఠశాల విద్యాశాఖ వసతులు కల్పించింది. అంతేకాక ఒక్కో పరీక్షకు మధ్య 2నుండి 3రోజుల వ్యవధి కల్పించింది. టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు మే 19న విడుదలయ్యే అవకాశముంది.

ఈసారి తెలుగు లేకుండానే..

ప్రతి ఏడాది తెలుగు విద్యార్థులు తమ మాతృభాషా సబ్జెక్టు రాసేందుకు వీలుండేది. సుప్రీంకోర్టు కల్పించిన వీలుతో వారు తెలుగు సబ్జెక్టులోనే పరీక్షలు రాసేవారు. ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి విద్యార్థులు తమిళ సబ్జెక్టే రాయాల్సివస్తోంది. అయితే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి 9-10 తరగతుల్లో చేరిన విద్యార్థులు మాత్రం తెలుగు సబ్జెక్టులో రాసేందుకు సుప్రీంకోర్టు వీలు కల్పించడంతో ఆ మేరకు ప్రభుత్వం ఏర్పాట్లు చేపట్టింది.

21వ తేదిలోగా పార్టీ జెండాలు తొలగించకపోతే కేసులు

- హెచ్చరించిన హైకోర్టు

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో ఉన్న పార్టీల జెండాలు, స్తంభాలను ఏప్రిల్ 21వ తేదిలోగా తొలగించని పక్షంలో కేసులు నమోదుచేయాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో జాతీయ, రాష్ట్ర రహదారులు, స్థానిక సంస్థలకు చెందిన ప్రాంతాలు ఆక్రమించి ఏర్పాటుచేసిన అన్ని రాజకీయ పార్టీలు, కుల-మత పరమైన జెండాలను 12 వారాల్లో తొలగించాలని హైకోర్టు మదురై ధర్మాసనం గత జనవరిలో ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఉత్తర్వులతో, జాతీయ, రాష్ట్ర, స్థానిక సంస్థలకు సొంతమైన రోడ్ల పక్కనే ఉన్న పార్టీ జెండాలు తొలగించాలని డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ పార్టీ నేతలు, కార్యకర్తలకు లేఖ రాశారు. ఈ క్రమంలో, చెన్నైకి చెందిన న్యాయవాది రమేష్... రాయపురం ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసిన పార్టీ జెండా స్తంభం, శిలాఫలాకం తొలగించేలా ఆదేశాలు జారీచేయాలని హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణ చేపట్టిన మద్రాసు హైకోర్టు... బహిరంగ ప్రాంతాలు, రోడ్లపై ఉన్న పార్టీ జెండాలను, స్తంభాలను ఏప్రిల్ 21వ తేదిలోపు తొలగించని పక్షంలో, కేసు నమోదుచేయవచ్చని ఉత్తర్వులు తేల్చి చెప్పింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (శుక్రవారం సాయంత్రం)
సహర్: 4:26 (శనివారం ఉదయం)

నేడు టీవీకే సర్వసభ్యమండలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తీర్మానాలు!

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) మొదటి సర్వసభ్యమండలి సమావేశం శుక్రవారం పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ అధ్యక్షత వహించనున్నారు. తిరువాన్మియూరులోని రామచంద్రా కన్వెన్షన్ హాలులో భారీ ఏర్పాట్ల నడుమ ఈ సమావేశానికి సంబంధించి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ గత కొద్ది రోజులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఈ సమావేశానికి వచ్చే పార్టీ అధ్యక్షుడు విజయ్‌కి ఘనస్వాగతం పలికేందుకు పనయూరులోని ఆయన నివాసగృహం నుంచి సభావేదిక వరకు ఉరహదారికి ఇరువైపులా అరటి చెట్లు, మామిడి తోరణాలు, బ్యానర్లు, పార్టీ జెండాలను కట్టారు. విజయ్ రాక సందర్భంగా గ్రామీణ కళాకారులు కరగాట్టం, ఒయిలాట్టమ్ తదితర నృత్యాలు చేయనున్నారు. రహదారికి ఇరువైపులా పదిమంది కార్యకర్తలు పార్టీ జెండాలతో గుర్రపుస్వారీ చేస్తూ విజయ్‌కి స్వాగతం పలుకనున్నారు. ఇక సభావేదిక ప్రవేశద్వారం వద్ద కోటను తలపించేలా భారీ సెట్టింగ్ నిర్మించారు. సర్వసభ్య మండలి సమావేశం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. టీవీకే రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ స్వాగతోపన్యాసం చేయనున్నారు. ఆ తర్వాత పెరియార్, కామరాజర్ తదితర దివంగత నేతలు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు విజయ్ పుష్పాంజలి ఘటించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పలు తీర్మానాలు చేయనున్నారు. చివరగా పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రసంగించనున్నారు.



భారీ భద్రతా ఏర్పాట్లు...

సమావేశం జరుగనున్న రామచంద్రా కన్వెన్షన్ హాలు ఇప్పటికే పూర్తిగా దుబాయ్ సెక్యూరిటీ రక్షణ వలయంలో ఉంది. వీరితోపాటు మరికొంతమంది ప్రైవేటు బౌన్సర్లు విజయ్‌కి దారిపొడవునా భద్రత కల్పించనున్నారు. ఈ సర్వ సభ్యమండలి సమావేశానికి గురువారం ఉదయం నుండే వివిధ జిల్లాల నుండి జిల్లా కార్యదర్శులు, నేతలు తిరువాన్మియూరు చేరుకున్నారు.

సమాచార దర్శిని

ఆదంబాక్కం శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూర్ మండలం 163వ వార్డు ఆదంబాక్కం బాలకృష్ణాపురం గ్యాస్ దహనవాటికలో మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ కారణంగా ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 24వ తేది వరకు ఈ శ్మశానవాటిక మూసివేయనున్నారు. అందువల్ల, 162వ వార్డులో ఉన్న కన్నన్ కాలనీ గ్యాస్ దహనవాటికను వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

ఆభరణాల లెక్కింపు, మెలకువలపై శిక్షణ

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సహకార శాఖ, చెన్నై జిల్లా కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ సెంటర్‌లో 2025-26వ సంవత్సరానికి ఆభరణాల లెక్కింపు, దాని మెళుకువలపై శిక్షణ ఇవ్వనున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులై 17 ఏళ్లకు పైబడిన వారు అర్హులు. తమళంలో ఇచ్చే ఈ శిక్షణలో వారాంతపు రోజులైన శని, ఆదివారాలు 34 రోజులు తరగతులు నిర్వహించనున్నారు. స్థానిక బ్రాడ్‌వేలోని చెన్నై కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో ఏప్రిల్ 13వ తేది దరఖాస్తులు సమర్పించాలి. వివరాలకు 044-25360041, 9444470013, 9042717766 అనే నెంబర్లు సంప్రదించాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు.

హోంగార్డ్స్‌లో అభ్యర్థుల ఎంపిక

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులతో కలసి హోంగార్డ్స్ విభాగంలో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక డిప్యూటీ జోనల్ కమాండర్, 52 మంది పురుషులు, ఆరుగురు మహిళా హోంగార్డ్‌లను నియమించనున్నారు.ఇందుకోసం ఆవడి కమిషనరేట్ పరిధిలోని నివసిస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు 18 నుంచి 50 ఏళ్లలోపు వారై ఉండాలి. ఎంపిక చేసిన వారు సమీపంలోని పోలీసు స్టేషన్లలో ట్రాఫిక్, భద్రతా విధులకు వినియోగించనున్నారు. ఆసక్తి కలిగిన వారు శుక్రవారం నుంచి ఆవడి పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలోని హోంగార్డ్స్ విభాగం కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు పొంది, పూర్తిచేసి ఏప్రిల్ 15వ తేదిలోపు అదే కార్యాలయంలో సమర్పించాలని అధికారులు తెలిపారు.

రూ.18 కోట్లతో వర్షపు కాలువల నిర్మాణం

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం మండలం విరుగంబాక్కం, కేకే నగర్ తదితర ప్రాంతాలు గత ఏడాది వరద ముంపుకు గురయ్యాయి. అందువల్ల, విరుగంబాక్కం తాంగళ్ ఏరికరై వీధి, శక్తి నగర్, కామరాజర్ హైరోడ్డు, కేకే నగర్ విజయరాఘవపురం 5వ వీధి, కేకే నగర్ 39,44,59వ వీధులు, భారతి దాసన్ కాలని మెయిన్ రోడ్డు తదితర 10 ప్రాంతాల్లో కాలువలు నిర్మించాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. ఆ ప్రకారం, రూ.18.12 కోట్ల వ్యయంతో వర్షపు కాలువల నిర్మాణాలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సంస్థలకు 'మంజపై' పురస్కారం

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లాలో ప్లాస్టిక్ రహిత విద్యా సంస్థలు, వాణిజ్య సంస్థలకు 'మంజపై' పురస్కారం అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా సంప్రదాయ పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిందన్నారు. తమ ప్రాంగణాలను ప్లాస్టిక్ రహితంగా మార్చే పాఠశాలలు, కళాశాలలు, వాణిజ్య సంస్థలు ఇలా మూడు విభాగాల్లో మూడు పురస్కారాలు అందజేయనున్నామని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10 లక్షలు, రెండు, మూడవ బహుమతులుగా తలా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు అందించనున్నామని, ఈ పురస్కారం కోసం www.tntiruvallurawards.com అనే వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, దరకాస్తు కాపీతో పాటు రెండు ప్రింట్ కాపీలు జతచేయాల్సి ఉంది. దరఖాస్తులను తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు వెబ్‌సైట్ www.tnpcb.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి మే 1వ తేదిలోపు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

'అమృత్ 2.0' పథకంలో శ్రీవిల్లిపుత్తూర్, పళని నగరాల అభివృద్ధి

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 'అమృత్ 2.0' పథకంలో శ్రీవిల్లిపుత్తూర్, పళని సహా ఏడు ఆలయాల నగరాల సమగ్రాభివృద్ధి ప్రాజెక్ట్ పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో లక్ష మందికి తక్కువగా నివసిస్తున్న 51 నగరాలను అమృత్ 2.0 పథకం అమలుచేయాలని నిర్ణయించారు. అందుకోసం కొత్త మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. అందులో శ్రీ విల్లిపుత్తూర్, పళని, తెన్‌కాశి, శంకరన్‌కోయిల్, మైలాడుదురై, చిదంబరం, తిరువారూరు తదితర ఏడు నగరాలు ఎంపిక చేశారు. ఈ నగరాల్లో వచ్చే 20 ఏళ్లలో పెరుగనున్న జనాభా, భక్తులు, పర్యాటకుల రాక తదితరాలకనుగుణంగా రోడ్లు, తాగునీరు, పార్కులు, వర్షపు నీరు, డ్రైనేజీ కాలువలు సహా మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇందుకోసం కలెక్టర్ నేతృత్వంలో అన్ని శాఖల అధికారులు సమావేశమై, సమగ్ర ప్రణాళిక నివేదిక తయారుచేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.07191 కాచిగూడ-మదురై స్పెషల్ (సోమవారం) ఏప్రిల్ 7 నుంచి మే 5వ తేది వరకు (5 ట్రిప్పులు), నెం.07192 మదురై-కాచిగూడ (బుధవారం) ఏప్రిల్ 9 నుంచి మే 7వ తేది వరకు (5 ట్రిప్పులు) పొడిగించారు.
- 07189 నాందేడ్- ఈరోడ్ (శుక్రవారం) స్పెషల్ ఏప్రిల్ 4 నుంచి మే 2వ తేది వరకు (5 ట్రిప్పులు), నెం.07190 ఈరోడ్-నాందేడ్ (ఆదివారం) స్పెషల్ ఏప్రిల్ 6 నుంచి మే 4వ తేది వరకు (5 ట్రిప్పులు) పొడిగించారు.
- నెం.07435 కాచిగూడ-నాగర్‌కోయిల్ (శుక్రవారం) స్పెషల్ ఏప్రిల్ 4 నుంచి మే 2వ తేది వరకు (5 ట్రిప్పులు), నెం.07436 నాగర్‌కోయిల్-కాచిగూడ) స్పెషల్ ఏప్రిల్ 6 నుంచి మే 4వ తేది వరకు (5 ట్రిప్పులు) పొడిగించారు.
- నెం.07601 చర్లపల్లి-విల్లుపురం (గురువారం) స్పెషల్ ఏప్రిల్ 3 నుంచి మే 1వ తేది వరకు (5 ట్రిప్పులు), నెం.07602 విల్లుపురం-చర్లపల్లి (శుక్రవారం) స్పెషల్ ఏప్రిల్ 4 నుంచి మే 2వ తేది వరకు (5 ట్రిప్పులు) పొడిగించినట్లు, ఈ ప్రత్యేక రైళ్ల సేవల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలియజేసింది.




దుకాణంలో మంటలకు దగ్ధమైన వస్తువులు - అగ్ని ప్రమాదంలో మార్కెట్ రహదారిలో స్తంభించిన ట్రాఫిక్

కున్నూరు మార్కెట్‌లో అగ్నిప్రమాదం

15 దుకాణాల దగ్ధం

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ సమీపం కున్నూరు మార్కెట్ ప్రాంతంలో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో 15 దుకాణాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో కోట్లాది రూపాయల మేరకు ఆస్తినష్టం సంభవించినట్లు దుకాణాల యజమానులు తెలిపారు. కున్నూరు మున్సిపల్ మార్కెట్‌లో 800లకు పైగా దుకాణాలున్నాయి. బుధవారం అర్ధరాత్రి ఆ మార్కెట్‌లోని దుస్తుల దుకాణంలో ఉన్నట్టుండి నిప్పురవ్వలు చెలరేగి క్షణాల్లో మంటలు వ్యాపించాయి. కాసేపటికల్లా ఇరువైపులా ఉన్న దుకాణాలకు కూడా నిప్పంటుకుంది. దీంతో ఆ దుకాణాల వద్ద ఉన్నవారంతా భయంతో పరుగులు తీశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక దళం హుటాహుటిన ఫైరింజన్‌తో ఆ ప్రాంతానికి వెళ్లిమంటలను ఆర్పేందుకు తీవ్రంగా పోరాడారు. అయినా మంటలు తగ్గకపోవడంతో ఊటీ, కోతగిరి ప్రాంతాల్లో బాంబులు తయారీ కర్మాగారాలకు చెందిన ఫైరింజన్లను తెప్పించి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో దుస్తులు, పెయింట్, కిరాణా సరకుల దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గురువారం వేకువజాము వరకూ అగ్నిమాపక దళం మంటలను ఆర్పేందుకు పోరాడారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



బడ్డీకొట్టులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

● కొడనాడు ఎస్టేట్ కేసు...

సీబీసీఐడీ విచారణకు సుధాకరన్ హాజరు

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత వేసవి విడిది కేంద్రమైన కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ తదితర కేసులకు సంబంధించి కోయంబత్తూరులోని సీబీసీఐడీ కార్యాలయంలో గురువారం జరిగిన విచారణకు ఆమె దత్తపుత్రుడు సుధాకరన్ హాజరయ్యారు. కొడనాడు ఎస్టేట్‌లో 2017లో వాచ్‌మెన్ ఓంబహదూర్ దారుణహత్యకు గురయ్యాడు. మరో వాచ్‌మెన్‌పై దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆ తర్వాత కొడనాడు ఎస్టేట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి విలువైన వస్తువులు, నగదు దోచుకెళ్లారు. అదే సమయంలో ఆ ఎస్టేట్‌లో సీసీ కెమెరాలను పర్యవేక్షించే కంప్యూటర్ ఇంజనీర్ ఆత్మహత్యకు గురయ్యాడు. ఈ వరుస సంఘటనలపై మొదట ఊటీ పోలీసులు విచారణ జరిపి సయాన్ సహా 10 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కేసుల విచారణ బాధ్యతను సీబీసీఐడీ పోలీసులకు అప్పగించారు. ఈ విచారణలో భాగంగానే జయలలిత దత్తపుత్రుడు సుధాకరన్‌కు సమన్లు పంపి గురువారం ఉదయం సీబీసీఐడీ పోలీసులు విచారణ జరిపారు. కొడనాడు ఎస్టేట్‌ను జయ కొనుగోలు చేసినప్పుడు ఆ లావాదేవీల్లో సుధాకరన్ భాగస్వామిగా వ్యవహరించారు. కొడనాడు ఎస్టేట్‌లో జయలలిత భద్ర పరచిన ఆస్తి పత్రాలు, వస్తువులు గురించి సీబీసీఐడీ పోలీసులు సుధాకరన్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది.



సీబీసీఐడీ కార్యాలయానికి వెళ్తున్న సుధాకరన్

'ఉక్కు మనిషి'కి ప్రతిరూపమే అమిత్ షా

● మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతిరూపమే హోంశాఖ మంత్రి అమిత్‌షాను చూస్తున్నారని అన్నాడీఎంకే మాజీ మంత్రి, శాసనసభ ప్రతిపక్ష ఉప నేత ఆర్బీ ఉదయకుమార్ అభివర్ణించారు. రెండు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సుమారు 2 గంటలకు పైగా సమావేశమయ్యారు. బీజేపీతో కూటమి ఏర్పాటుపై చర్యలు సాగినట్లు వచ్చిన వార్తలను పళనిస్వామి ఖండించారు. ఈ నేపథ్యంలో, అమిత్‌షాతో పళనిస్వామి సమావేశం కావడంతో ఎంతో ఆనందాన్ని ఇచ్చిందంటూ ఆర్బీ ఉదయకుమార్ వీడియో విడుదల చేశారు. అందులో... భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతిరూపమైన హోంశాఖ మంత్రి అమిత్ షాను, తమిళనాడు ఉక్కు మనిషి ఎడప్పాడి పళనిస్వామి కలుసుకున్న వ్యవహారంలో పలు వార్తలు వెలువడుతున్నాయని, రాష్ట్ర ప్రజల సమస్యలు తెలిపేందుకు పళనిస్వామి ఢిల్లీ వెళ్లారని తెలిపారు. పళనిస్వామి-అమిత్ షా సమావేశంలో ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేలా అన్నాడీఎంకే కార్యకర్తలు విస్తృత ప్రచారం చేపట్టాలని ఉదయకుమార్ పిలుపునిచ్చారు.



వీధి ప్రచారంలో ఉదయకుమార్

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● సీబీఎఫ్ డైరెక్టర్ జడ వసంతబాబు



విద్యార్థులతో జడ వసంతబాబు

ప్యారీస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రత, శ్రద్ధతో చదువుకున్న పాఠ్యాంశాలను జ్ఞాపకం ఉంచుకుని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కొరుక్కుపేట కామరాజర్‌నగర్‌లోని సీబీఎఫ్ డైరెక్టర్ రెవ.డా. జడ వసంతబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో శుక్రవారం నుండి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ విద్యార్థుల కోసం గురువారం కామరాజర్‌నగర్‌లో జడ వసంతబాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు విద్యార్థులు హాజరయ్యారు. వారికి విద్యాసామగ్రి అందజేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమం అనంతరం ఇటీవల రాజమండ్రి ప్రాంతంలో మరణించిన ప్రముఖ క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ ఆత్మ శాంతి కోసం ప్రార్థించారు.

ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లకు ప్రథమ చికిత్సపై అవగాహన

వేలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడుక్కమ్‌పారైలోని వేంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం జరిగింది. ఈ శిబిరంలో కాట్పాడి డివిజన్ రెడ్‌క్రాస్ సంఘం తరఫున క్యాడెట్లకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంఘం అవై అధ్యక్షుడు జనార్ధనన్, డా.దీనబంధు తదితరులు ప్రథమ చికిత్స పై డెమో ప్రదర్శించారు. ఈ శిబిరంలో పంచాయతీ అధ్యక్షుడు రవిచంద్రన్, కళాశాల అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు జనార్ధనన్, ఎస్ఎస్ఎస్ పథక అధికారి కుమరేశన్, కళాశాల ప్రిన్సిపాల్ పాల్ జ్ఞానశేఖరన్, జిల్లా కలెక్టర్ మాజీ పీఏ సుందరపాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

డీఎంకే నేతల ఆధ్వర్యంలో చలివేంద్రం



ప్రయాణికులకు మజ్జిగ, కూల్‌డ్రింక్స్ అందజేస్తున్న డీఎంకే నేతలు

తిరుత్తణి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని కొళత్తూరు గ్రామంలోని బస్టాండు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన డీఎంకే మండల కార్యదర్శి, అడ్వకేట్ శ్రీనివాసన్‌ను అభినందించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సెంథిల్‌కుమార్, మాజీ కార్యదర్శి రవీంద్రనాధ్, అధ్యక్షుడు తిరుమల లోగనాధన్, జిల్లా ప్రతినిధులు ఆర్ముగం, పార్టీ నిర్వాహకులు సెంగయ్య, జగదీశన్, వెంకట పెరుమాళ్, మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణాలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

గృహ నిర్మాణాల పరిశీలన

వేలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కేవీ కుప్పం సమీపం పళమండగి పంచాయతి పరిధిలో 'కలైంజర్ కనవు ఇల్లం' పథకంలో నిర్మిస్తున్న గృహాలను గురువారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. పనులు నాణ్యతగా, నిర్ణీత వ్యవధిలో నిర్మాణాలు పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుమాళ్, గ్రామీణాభివృద్ధి ఇంజనీర్ శ్రీనివాసన్, కేవీ కుప్పం తహసీల్దార్ మురళీధరన్, బీడీఓలు పెరుమాళ్, సతీష్‌కుమార్, పళమడంగి పంచాయతి అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది మార్చినాటికి 2 లక్షల ఇళ్ల నిర్మాణం

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'కలైంజర్ కనవు ఇల్లం' పథకంలో 2026 మార్చి ఆఖరుకు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేస్తామని మంత్రి ఐ.పెరియస్వామి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా బుధవారం మంత్రి మాట్లాడుతూ... పేదలకు సొంతింటి కళ నెరవేర్చాలనే లక్ష్యంతో చేపట్టిన 'కలైంజర్ కనవు ఇల్లం' పథకానికి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.3,500 కోట్లు కేటాయించామన్నారు. ఈ పథకంలో ఇప్పటివరకు 25 వేల గృహాల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. తాజాగా, ఈ పథకానికి రూ.2,418 కోట్లు విడుదల చేసినట్లు, వచ్చే ఏడాది మార్చి ఆఖరుకు 2 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

2 నుంచి మదురైలో సీపీఎం జాతీయ మహానాడు

ప్యారీస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2 నుండి 6వ తేదీ వరకు మదురైలో సీపీఎం జాతీయస్థాయి మహానాడు జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం పేర్కొన్నారు. గురువారం ఆయన మదురైలో మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీ ఉదయం పశ్చిమ బెంగాళ్ సీనియర్ నేత బీమన్ బాసు పతాకాన్ని ఆవిష్కరించి సీపీఎం 24వ జాతీయస్థాయి మహానాడు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మహానాడులో, కశ్మీర్ నుండి కన్నియాకుమారి వరకు కేంద్రపాలిత రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. అఖిల భారత సీపీఎం ఆర్గనైజర్ ప్రకాశ్‌కారత్, కేరళ సీఎం పినరయి విజయన్, బృందాకారత్, త్రిపుర మాజీ సీఎం మానిక్ సర్కార్, పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దిబాంకర్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ పార్టీ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ సహా పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 3వ తేదీ సాయంత్రం జరగనున్న కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కర్ణాటక రెవెన్యూ శాఖామంత్రి కృష్ణబైరే గౌడ, కేరళ సీఎం విజయన్ పాల్గొని రాష్ట్రాల హక్కులు, భద్రత అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. 6వ తేదీ వండియూర్ రింగురోడ్డులోని టోల్‌గేట్ సమీపంలో నిర్వహించనున్న బహిరంగసభలో కామ్రేడ్లు జి.రామకృష్ణన్, కె.బాలకృష్ణన్, వాసుకి, సంపత్ తదితరులు పాల్గొంటారని షణ్ముగం తెలిపారు.



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేస్తున్న సీపీఎం రాష్ట్రకార్యదర్శి షణ్ముగం తదితరులు

20 తర్వాత డ్రైవర్ రహిత మెట్రో ట్రయల్ రన్

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ రహిత మెట్రోరైలు ట్రయల్ రన్ ఏప్రిల్ 20వ తేది తర్వాత నిర్వహించనున్నారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారి ఒకరు మాట్లాడుతూ... చెన్నై మెట్రోరైలు రెండో ప్రాజెక్టులో పూందమల్లి-పోరూర్ మధ్య 8 కి.మీ మేర పనులు పూర్తికానున్న నేపథ్యంలో,వచ్చే డిసెంబరు నుంచి ఈ మార్గంలో రైళ్లు నడపాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా ఈ నెల 20వ తేది పూందమల్లి డిపో-ముల్లై గార్డన్ మధ్య 2.5 కి.మీ దూరం 25 కి.మీ వేగంతో డ్రైవర్ రహిత మెట్రో రైలు ట్రయల్ రన్ విజయవంతమైందన్నారు. రెండవ విడతగా పూందమల్లి-పోరూర్ మధ్య 8. కి.మీ దూరం ట్రయల్ రన్ ఏప్రిల్ 20వ తేది తర్వాత ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉదయనిధికి అస్వస్థత

● క్రీడా విధానాన్ని ప్రవేశపెట్టిన స్టాలిన్

చెన్నై,మార్చి27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తీవ్ర అస్వస్థతకు గురై ఇంటివద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయాన్ని శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్ తెలియజేశారు.గురువారం ఉదయం శాసనసభలో ఉదయనిధి ప్రవేశపెట్టాల్సిన క్రీడా సంక్షేమం, యువజన సంక్షేమ శాఖలకు సంబంధించి ప్రత్యేక అంశాల ప్రణాళికా విధానాలను స్టాలిన్ ప్రవేశపెట్టారు. ఆ సందర్భంగా ఉదయనిధి సభకు రాకపోవడంపై స్టాలిన్ వివరణ ఇస్తూ బుధవారం స్వల్ప అస్వస్థతోనే సమావేశంలో పాల్గొన్నారని, గురువారం ఉదయం తీవ్ర అస్వస్థతతో ఉండటం వైద్యుల సలహా మేరకు ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకుంటున్నారని చెప్పారు. ఉదయనిధి తరఫున రెండు ప్రణాళికా విధానాలను సభ ముందు ఉంచుతున్నానని స్టాలిన్ పేర్కొన్నారు.

చెన్నై సెంట్రల్-ముంబై ప్రత్యేక వారాంతపు రైళ్లు

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ముంబై - చెన్నై సెంట్రల్ మధ్య వారాంతపు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.01015 ముంబై - చెన్నై సెంట్రల్ వారాంతపు ప్రత్యేక రైలు ఏప్రిల్ 9,16,23,30 తేదీల్లో ముంబైలో అర్ధరాత్రి 12.20 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.01016 చెన్నై సెంట్రల్-ముంబై వారాంతపు ప్రత్యేక రైలు చెన్నై సెంట్రల్ నుంచి ఏప్రిల్ 10,17,24,మే 1 తేదీల్లో తెల్లవారుజామున 4 గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 4.15 గంటలకు ముంబై చేరుకుంటుంది. ఈ రైళ్లు పెరంబూర్, అరక్కోణం, రేణిగుంట, రాజంపేట, కడప మీదుగా వెళ్లనున్నాయి.

విద్యా రుణాలను రద్దు చేయాలని పిటిషన్

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎన్నికల హామీల్లో ఒకటైన విద్యా రుణాల రద్దు అమలుచేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలైంది. తిరుప్పూర్‌కు చెందిన మణిమారన్ దాఖలుచేసిన పిటిషన్‌లో.. రాష్ట్రంలో 2016 నుంచి 2024 వరకు జరిగిన ఎన్నికల్లో, విద్యా రుణాలు రద్దు చేస్తామని డీఎంకే, అన్నాడీఎంకే తదితర పార్టీలు ప్రకటించాయన్నారు. ఎన్నికల హామీలో తెలిపిన ప్రకారం, విద్యా రుణాలు రద్దు చేసే పథకం అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేయాలని, సాధ్యం కాని హామీలు ప్రకటించకుండా అడ్డుకునే కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు రూపొందించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్, న్యాయమూర్తి మహమ్మద్ సబీక్ నేతృత్వంలోని ధర్మాసనం త్వరలో విచారించనున్నట్లు సమాచారం.

విద్యుత్ చోరీ ఘటనల్లో రూ.1.23 కోట్ల జరిమానా వసూలు

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత రెండు వారాల్లో 134 విద్యుత్ చోరీలు గుర్తించి, అలాంటి చర్యలకు పాల్పడిన వారి నుంచి రూ.1.23 కోట్లు జరిమానా వసూలుచేశారు.ఈనెల 4నుంచి 7వరకు ఆయా మండలాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో విద్యుత్ చోరీ గుర్తించి జరిమానా వసూలుచేశారు.భవిష్యత్తులో ఈ ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేస్తామని, విద్యుత్ చోరీలకుపాల్పడేవారికి భారీ జరిమానా విధిస్తామని విద్యుత్‌బోర్డు హెచ్చరించింది.

శ్రీలంక నావికాదళం దాడులు

● 11 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నెడుదీవి వద్ద బుధవారం అర్ధరాత్రి చేపలవేట సాగిస్తున్న రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం విరుచుకుపడింది. తమ దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించారని ఆరోపిస్తూ 11 మంది జాలర్లను అరెస్టు చేశారు. వారి పడవలను కూడా శ్రీలంకకు తరలించుకెళ్లారు. రామేశ్వరం వేర్‌కోడు ప్రాంతానికి చెందిన జెర్సిస్ అనే వ్యక్తికి చెందిన మరపడవలో భాగ్యరాజ్ (38) జవేరియా అడిమై (35), ముత్తు కళంజియం (27), ఎఇరోస్ (35), రంజిత్ (33), ఇన్నాసి (25) క్రీస్తు (45), ఆర్నాడ్ రిచే (36), బాలా (38), నానన్ (36), ఆంటోని సిజోరియన్ (43) అనే జాలర్లు బుధవారం ఉదయం రామేశ్వరం నుండి సముద్రంలో చేపలవేటకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి నెడుదీవి వద్ద చేపలుపడుతుండగా గస్తీ నౌకలో వచ్చిన శ్రీలంక నావికాదళం చుట్టుముట్టి మరపడవలో ఉన్న జాలర్లపై దాడులు జరిపి అరెస్టు చేసింది. ఆ తర్వాత అందరినీ శ్రీలంకలోని మయిలట్టి చేపలరేవుకు తరలించి అక్కడి మత్స్యశాఖ ఉన్నతాధికారులకు అప్పగించింది. ఈ విషయం తెలుసుకున్న రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులంతా తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. అరెస్టయిన జాలర్ల కుటుంబీకులు శోకతప్తులయ్యారు.

సెమ్మంజేరిలో వందెకరాల్లో క్రీడా మైదానం

ప్యారీస్,మార్చి27(ఆంధ్రజ్యోతి): షోలింగనల్లూరు సమీపంలోని సెమ్మంజేరిలో వంద ఎకరాల విస్తీర్ణంలో క్రీడా మైదానం నిర్మించనున్నట్లు యువజన సంక్షేమం, క్రీడాశాఖ ప్రణాళికా బద్ధమైన విధానంలో పేర్కొన్నారు. గురువారం ఉదయం జరిగిన అసెంబ్లీ సమావేశంలో వెల్లడించిన నివేదికలో, విదేశీ స్థాయిలోవున్న క్రీడామైదానాల్లో లాగే హైటెక్ వసతులతో జాతీయ,అంతర్జాతీయ పోటీలు నిర్వహించేందుకు అనుగుణంగా ఈమైదానం ఏర్పాటుకానుంది.

ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం

ప్యారీస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లోని కార్యాలయ భవనంలో గురువారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదం ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది. ఈ కార్యాలయ భవనంలోని మొదటి అంతస్తులో హఠాత్తుగా మంటలు రావడం గుర్తించిన ఉద్యోగులు వెంటనే వెప్పేరి లోవున్న అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగలేదని, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగుంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఇదిలా వుండగా, అగ్నిప్రమాదం కారణంగా సిగ్నలింగ్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని ఐటీ నిపుణులు సరిచేసినట్లు అధికారులు తెలిపారు.

అల్పాహారం తీసుకున్న విద్యార్థులకు అస్వస్థత

వాషర్‌మెన్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం తీసుకున్న విద్యార్థులు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. ధర్మపురి జిల్లా కడత్తూర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఉదయం అల్పాహారం అందజేశారు. 80 మంది విద్యార్థులు అల్పాహారం తీసుకున్న కొద్దిసేపటికి 16 మంది విద్యార్థులు వాంతులు చేసుకుంటూ స్పృహతప్పి పడిపోయారు. ఉపాధ్యాయులు వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న విద్యాశాఖ అధికారులు పాఠశాలకు చేరుకొని అల్పాహారం శాంపిల్స్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

పులి దాడిలో యువకుడి మృతి

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కవర్నన్‌చోలై ప్రాంతంలో పులి దాడిలో గిరిజన యువకుడు మృతిచెందాడు. ఊటీ కవర్నర్‌సోలై కొల్లకోడు మంద్రైలో చిరుతపులులు, పలులు తదితర జంతువులు జనావాసాల్లోకి వస్తుండడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో, గురువారం తెల్లవారుజామున ఆ ప్రాంతానికి చెందిన గిరిజన యువకుడు కేందర్‌కుట్టన్ పులి దాడిలో మృతిచెందాడు. సమాచారం అందుకున్న అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకొని విచారించారు. జంతువుల సంచారం అడ్డుకొనేలా చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు తెలిపినా ఫలితం లేకపోయిందని ఆరోపించిన గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో, అధికారులు వారిని శాంతింపజేసేలా చర్యలు చేపట్టారు.



కేందర్‌కుట్టన్ (ఫైల్‌ఫొటో)

యూట్యూబర్‌పై డీపీఐ ఫిర్యాదు

వేలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్‌పై అసత్య ప్రచారం చేసిన యూట్యూబ్ ఛానల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ పార్టీ నేతలు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ ఛానల్‌లో తిరుమావళవన్, మాజీ జిల్లా సెక్రటరీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన తగిన చర్యలు చేపడతామని ఎస్పీ మదివానన్ హామి ఇచ్చారని డీపీఐ నేతలు తెలిపారు.



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన డీపీఐ నేతలు, కార్యకర్తలు



వెయ్యి మాసాల పుణ్యఫలం 'షబేఖదర్'

ముస్లింలకు రంజాన్ మాసం పరమ పవిత్రమైనది. ఈ మాసంలో 30రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేస్తారు. ఈ 30 రోజులను మూడుభాగాలుగా విభజించారు. చివరి పదిరోజులు మరింత ప్రత్యేకత సంతరించుకుంటుంది. వెయ్యిమాసాలకన్న ఎక్కువ పుణ్యఫలం అందించే ఘనమైన రాత్రి 'షబేఖదర్' ఈ చివరి పదిరోజుల్లో రావడం విశేషం. ఈ రాత్రిని "లైలతుల్ ఖద్ర్'గా పాటించి ముస్లిం సోదరులు రాత్రంతా మసీదుల్లో జాగారణ చేస్తారు.

– ఆంధ్రజ్యోతి, ప్యారీస్



ప్రత్యేకతలు...

రంజాన్ మాసానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఫిత్రా ఆదేశాలు కూడా ఈ మాసంలోనే అవతరించాయి. ఫిత్రా (దానం) వల్ల పేదలకు ఆర్థికంగా కాస్త ఊరట లభిస్తుంది. ఈ శుభప్రదమైన మాసంలో ప్రపంచ వ్యాప్తంగా ఎటు చూసినా శాంతి కనిపిస్తుంది. రంజాన్ మాసానికి ప్రాముఖ్యత రావడానికి కారణం పవిత్రగ్రంథం 'ఖురాన్' అవతరించి, దేవదూతలు ఒక రాత్రివేళ దివినుండి భువికి దిగి రావడం. ఈ దివ్యమైన రాత్రిని 'లైలాతుల్ ఖద్ర్', 'షబేఖదర్'గా దివ్య ఖురాన్‌లో పేర్కొనడం గమనార్హం.

లైలాతుల్‌ఖద్ర్ అంటే సౌభాగ్యాల నిర్ణయం జరిగే రాత్రి అని అర్థం. అదృష్టాలను మెరుగుపరచే లేదా చెరిపివేసే రాత్రి అని కూడా ఇస్లాం మత గురువులు చెబుతున్నారు. ఈ రాత్రి ఎంతో విలువైన, శుభకరమైన, మహత్తరమైనదని, వెయ్యి మాసాలకన్నా ఉత్తమమైన రాత్రి అని, తమ అల్లాహ్ అనుమతితో దేవదూతలు ఈ రాత్రి భూమి మీదకు దిగివస్తారని, వారిని ఘనంగా ఆహ్వానించేందుకు రాత్రంతా నిద్రపోకుండా జాగరణ చేసి, ప్రార్థనలు చేస్తారని ముస్లిం మతపెద్దలు విశదీకరించారు.

బేసి రాత్రులు...

హజరత్ ఉబదాబిన్ సామిత్ ఉల్లేఖనాల ప్రకారం దైవప్రవక్త లైలాతుల్ ఖద్ర్ రంజాన్ మాసం చివరి పదిరాత్రుల్లో బేసి రాత్రులు అంటే 21, 23, 25, 27, 29 తేదీల్లో వచ్చినవి. ఈ ఐదు రాత్రుల్లో ఏదైనా ఒకటి షబేఖదర్ కావచ్చు. అయితే 27వ రాత్రి మహిమాన్వితదికావడానికి ఎక్కువ అవకాశాలున్నాయని మహ్మద్ ప్రవక్త, అనుచరులు కొన్ని ఉల్లేఖనాలను బట్టి తెలుస్తోంది. అందుకే ఇస్లామిక్ కాలమానం ప్రకారం రంజాన్ మాసంలోని 21వ రోజు మొదలు 29వ రోజు వరకు ఈ ఐదు రాత్రుల్లో ప్రత్యేక ఆరాధనలు చేసినప్పటికీ 27వ రాత్రిపైనే ఆశలు పెట్టుకుంటారు. ఈ ఘనమైన రాత్రి చేసే ప్రార్థనలు, సత్కార్యాలు ఇతర వెయ్యిమాసాల్లో చేసే వాటి కన్నా ఎంతో శ్రేష్ఠమైనదిగా పేర్కొంటారు.



మానవాళికి మార్గదర్శకం 'ఖుర్-ఆన్'...

మానవుడు పుట్టింది మొదలు మరణించేవరకు వివిధ దశల్లో ఎలా మసలుకోవాలో 'దివ్య ఖురాన్'లో స్పష్టంగా చెప్పబడింది. ఇంతటి మహద్భాగ్యాన్ని 'షబేఖదర్'లో అవతరింపజేసేందుకు ఆ రాత్రి చేసే ఆరాధనలు కూడా అంత విశిష్టతను పొందాయి. సమస్త ఉపదేశాలు, ఆరాధనల ఉద్దేశం మానవులను నైతికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా, ఆరోగ్యపరంగా అన్ని విధాలుగా సంస్కరించడమే. అలాంటి మహత్తరమైన రాత్రిని సద్వినియోగం చేసుకోవడానికి ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో దైవారాధనలో గడుపుతారు.

రాత్రంతా జాగారం..

వెయ్యి మాసాల పుణ్యఫలం ప్రాప్తించే షబేఖదర్ దివ్యరాత్రి జాగరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా మసీదులు, దర్గాలు, ముస్తాబయ్యాయి. ఈ ఏడాది రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 2వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు సతామీ పర్వదినం సందర్భంగా గురువారం రాత్రంతా జాగారం చేసి ప్రార్థనల్లో గడిపారు. రాత్రి 8.30 గంటలకు ప్రారంభమైన ప్రార్థనలు తెల్లవారు జాము వరకు కొనసాగాయి. మరోవైపు రాష్ట్ర పోలీస్ శాఖ మసీదులున్న ప్రాంతాల్లో బందోబస్తు పటిష్ఠం చేసింది.



ఖుష్బూ, మీనా, నయనతార

ప్లీజ్.. వదంతులు నమ్మొద్దు : ఖుష్బూ

తన భర్త, ప్రముఖ సినీ దర్శకుడు సుందర్, హీరోయిన్ నయనతార మధ్య మనస్పర్థలు తలెత్తడంతో 'మూక్కుత్తి అమ్మన్' రెండో భాగం చిత్రీకరణ ఆగిపోయినట్టు సాగుతున్న ప్రచారంపై నటి ఖుష్బూ స్పందించారు. దయచేసి వదంతులు నమ్మకండి.. ఏదైనా సందేహం ఉంటే వివరణ తీసుకుని వార్తలను ప్రచురించండంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ప్రముఖ నిర్మాత ఐసరి కె.గణేష్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'మూక్కుత్తి అమ్మన్-2'. సుందర్ సి దర్శకుడు. నయనతార ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కొవిడ్ సమయంలో వచ్చిన 'మూక్కుత్తి అమ్మన్'కు సీక్వెల్. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. అయితే, లొకేషన్‌లో కాస్ట్యూమ్ విషయంలో ఒక అసిస్టెంట్ దర్శకుడుకి, నయనతారకు మధ్య గొడవ జరిగిందనీ,ఈ విషయం తెలుసుకున్న దర్శకుడు సుందర్ హీరోయిన్ నయనతారను మందలించడంతో పా టు షూటింగ్ నిలిపివేసినట్టు వార్తలు వచ్చా యి. ఈ అంశం చర్చనీయాంశంగా మారడంతో ఖుష్బూ స్పందించారు.'మూక్కుత్తి అమ్మన్-2' మూవీ పై సామాజిక మాధ్యమాల్లో అనేక రకాలైన ప్రచారం సాగుతోంది. ఇందులో అణుమాత్రం కూడా నిజంలేదు. షూటింగ్ అనుకున్న ప్రకారం సాఫీగా సాగిపోతోంది.సుందర్ ఎలాంటి దర్శకుడో మీకందరికి తెలు సు. అదేవిధంగా నయనతార కూడా గొప్ప నటి. గతంలో ఆమె నటించిన ఒక పాత్రలో మళ్ళీ నటించేందుకు ముందుకు వచ్చారు. సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారం ఈ సినిమాకు దిష్టి తీసినట్టుగా భావిస్తున్నాం. జరిగేదంతా మంచికే... మీ ఆశీస్సులు, ప్రేమను సర్వదా కోరుకుంటున్నాం'అని ఖుష్బూ ట్వీట్‌లో పేర్కొ న్నారు.

కోలీవుడ్‌కు శ్రీలంక నటి



మిచెల్లీ దిల్హారా

దర్శకుడు రాసయ్య కన్నన్ రూపొందించే 'బైలా' అనే చిత్రం ద్వారా శ్రీలంకకు చెందిన మిచెల్లా దిల్హారా అనే నటి కోలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. సముద్రఖని ప్రధాన పాత్రలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సముద్రఖని భార్యగా హీరోయిన్ రమ్యా నంబీశన్ నటించగా, మరో హీరోయిన్‌గా శ్రీలంకకు చెందిన మిచెల్లా దిల్హారాను ఎంపిక చేశారు. వీరితో పాటు రాజ్‌కుమార్, యోగిబాబు, ఇళవరసు, సింగంపులి, మధుమిత తదితరులు నటిస్తున్నారు. 'ఛేజింగ్' సినిమా దర్శకుడు కే.వీరకుమార్ ఈ మూవీకి కథ సిద్ధం చేయగా, దర్శకుడు విజి మాటలు అందించారు. డ్రీమ్స్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నీలగిరి మురుగన్, కేఆర్‌ఎం మూవీస్ సంస్థ తరపున కేఆర్ మురుగానందం కలిసి నిర్మిస్తున్నారు.


సంక్రాంతి రేసులో 'విజయ్ వర్సెస్ ఎస్కే'



విజయ్, శివకార్తికేయన్

తమిళ చిత్రజ్యోతి

వచ్చే యేడాది సంక్రాంతి రేసులో అగ్రహీరోలు విజయ్, శివకార్తికేయన్ (ఎస్కే) వెండితెరపై పోటీపడనున్నారు. విజయ్ నటించే 'జన నాయగన్', శివకార్తికేయన్ నటించే 'పరాశక్తి' సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జన నాయగన్' 2026 జనవరి 9న సంక్రాంతి పండుగకు విడుదల చేయనున్నట్టు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో విజయ్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఇది విజయ్ నటించే చివరి చిత్రం కావడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'జన నాయగన్' రిలీజ్ తేదీని అధికారికంగా వెల్లడించిన కొన్ని గంటలకే 'పరాశక్తి' నిర్మాత ఆకాశ్ భాస్కరన్.. 'ఇంద పొంగల్' అంటూ ట్వీట్ చేశారు. అంటే తమ చిత్రం కూడా పొంగల్ రేసులో ఉంటుందని ఆయన నర్మగర్భంగా చెప్పకనే చెప్పారు. దీంతో విజయ్, శివకార్తికేయన్ చిత్రాలు సంక్రాంతి బరిలో పోటీపడే పరిస్థితి నెలకొంది. నిజానికి విజయ్‌కు ఎస్కే వీరాభిమాని. అందుకే విజయ్ 'ది గోట్' మూవీ చివరి సన్నివేశంలో శివకార్తికేయన్ నటించారు. ఇపుడు వీరిద్దరి చిత్రాలు సంక్రాంతి రేసులో పోటీలో ఉండటం గమనార్హం.



'ఇడ్లీకడై'లో ధనుష్, నిత్యా మేనన్

ధనుష్ చిత్రం విడుదలలో జాప్యం

హీరో ధనుష్ దర్శకత్వం వహించి, నటించిన చిత్రం 'ఇడ్లీకడై'. ఈ చిత్రం విడుదలలో చిక్కులు ఎదురవుతున్నాయి. నిజానికి ఈ చిత్రం ఏప్రిల్ 10వ తేదీ విడుదల చేయనున్నట్టు గతంలో మేకర్స్ ప్రకటించారు. కానీ, అనివార్య కారణాల కారణంగా సినిమాను అనుకున్న తేదీకి విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణ అసంపూర్తిగా ఉండటం, చిన్న ప్యాచ్ వర్క్ పూర్తి చేయాల్సి వుంది. ప్రస్తుతం ఈ సినిమా తుదిదశ చిత్రీకరణ కోసం చిత్ర బృందం థాయ్‌లాండ్ వెళ్ళింది. అక్కడే సుమారు 15 రోజుల పాటు షూటింగ్ చేయాల్సి ఉంది. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు చేయాల్సి ఉండటంతో ఈ మూవీని జూన్ లేదా ఆగస్టు నెలలో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అయితే, ఆగస్టులో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రం విడుదలకానుంది. దీంతో ధనుష్ తన చిత్రాన్ని జూన్ లేదా జూలై నెలలో విడుదల చేయాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు అరుణ్ విజయ్, నిత్యా మేనన్, షాలినీ పాండే, ప్రకాష్ రాజ్, రాజ్‌కిరణ్‌లు ప్రధాన పాత్రలను పోషించగా, తమిళం, తెలుగు భాషల్లో వుండర్‌బార్ ఫిల్మ్స్ పతాకంపై తెరకెక్కుతోంది.



ట్రావెల్ కార్డు పరిచయం చేస్తున్న మంత్రి శివశంకర్, ఎంటీసీ ఎండీ ప్రభుశంకర్ తదితరులు

'సింగార చెన్నై' ట్రావెల్ కార్డు ఆవిష్కరణ

పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులే రీచార్జి చేసుకొనేలా 'సింగార చెన్నై' ట్రావెల్ కార్డును రవాణా శాఖ మంత్రి శివశంకర్ పరిచయం చేశారు. నగరంలో ఎంటీసీ నడుపుతున్న అన్ని బస్సుల్లో 'సింగార చెన్నై' గుర్తింపు కార్డు ద్వారా టిక్కెట్లు పొందే విధానం అమలులో ఉంది. ఈ విధానం మరింత సులభతరం చేసేలా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ ఆధ్వర్యంలో 'సింగార చెన్నై' కార్డును బుధవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభుశంకర్ నేతృత్వంలో మంత్రి శివశంకర్ పరిచయం చేశారు. మెట్రో రైళ్లు, ఎంటీసీ బస్సులు తదితరాల్లో ప్రయాణించే సౌలభ్యం ఉన్న ఈ కార్డు రూ.100కు అందజేస్తున్నారు. అందులో రూ.50 విలువైన టిక్కెట్లు తీసుకోవచ్చు.అలాగే, ఆన్‌లైన్, మొబైల్ యాప్, ఆధీకృత ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సేల్స్ సెంటర్ ద్వారా సులభంగా రీచార్జి చేసుకోవచ్చు. అలాగే,కార్డు వెనుక వైపున్న క్యూఆర్ స్కాన్ చేసి ప్రయాణికులే స్వయంగా రీచార్జి చేసుకొనే వసతి కల్పించారు. ప్రధాన బస్టాండ్లలో ట్రావెల్ కార్డును కొనుగోలు చేయవచ్చని ఎంటీసీ అధికారులు తెలిపారు.

'మియాట్'ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

● వేర్వేరు బ్లడ్ గ్రూపుల మధ్య కాలేయ మార్పిడి



ప్రేమ్‌నాథ్‌ను అభినందిస్తున్న మియాట్ చైర్మన్, వైద్యబృందం

చెన్నై, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మియాట్ ఇంటర్నేషనల్ ఆస్పత్రిలో వేర్వేరు బ్లడ్‌గ్రూపుల మధ్య కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతగా నిర్వహించారు. ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్య పథకం కింద ఈ మార్పిడి చేయడం మరో విశేషం. ఇది అత్యంత సంక్లిష్టమైన, అరుదైన విధానం కాగా, దీని వల్ల 32 ఏళ్ల రోగి ప్రాణాలు రక్షింపబడ్డాయి. ఈ వివరాలను మియాట్ ఆసుపత్రి చైర్మన్ మల్లికా మోహన్‌దాస్, వైద్యులు డాక్టర్ కార్తీక్, డాక్టర్ జోషువా గురువారం మీడియాకు వెల్లడించారు. మేట్టుపాళయంకు చెందిన ప్రేమ్‌నాథ్ దీర్ఘకాలిక కాలేయ వైఫల్యం, పిత్త వాహిక వ్యాధితో బాధపడేవాడు. అతని ప్రాణాలను రక్షించడానికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స అవసరమైంది. అయితే మరణించిన వ్యక్తి నుంచి కాలేయమార్పిడి అనేది సాధ్యమయ్యేది కాదు. అనుకూలమైన బ్లడ్‌గ్రూప్‌తో జీవించివున్న దాత లేకపోవడం వల్ల పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. దీంతో ప్రేమ్‌నాథ్ భార్య కాలేయం దానం చేసేందుకు అంగీకరించారు. అయితే వారిద్దరివీ వేర్వేరు బ్లడ్‌గ్రూపులు కావడం మళ్లీ సమస్య మొదటికొచ్చినట్లయింది. వేర్వేరు బ్లడ్ గ్రూప్‌ల మధ్య కాలేయ మార్పిడి అరుదుగా జరుగుతుంది. అవయవ తిరస్కరణకు ఎక్కువ ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించేందుకు, ప్రేమ్‌నాథ్‌కు రోగనిరోధక శక్తిని అణచివేసే వివిధ ఏజెంట్లను అధిక మోతాదులో అందించారు. ఇది అతని రోగనిరోధక వ్యవస్థను బలహీనపరచి, అంటువ్యాధుల బారిన పడే ప్రమాదాన్ని పెంచింది. అదనంగా శరీరంలో వున్న యాంటీ-బి ప్రతిరోధకాలను తొలగించేందుకు ఆయన ప్లాస్మా ఎక్స్ఛేంజ్ థెరపీ చేయించుకున్నారు. ఈ విధానాలు ఎంతో క్లిష్టమైనవి, ఎందుకంటే అవయవ మార్పిడి విజయాన్ని నిర్ధారించడంతో పాటు తరచుగా వచ్చే అంటువ్యాధులను ఎదుర్కోవడం కూడా ప్రధాన లక్ష్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో వైద్యబృందం ఖచ్చితమైన సంరక్షణతో, అతన్ని అంటువ్యాధుల నుంచి రక్షించడంతో పాటు పూర్తి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం ప్రేమ్‌నాథ్, అతడి భార్య పూర్తిగా కోలుకున్నారు. ఈ సందర్భంగా వారు మియాట్ వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

నామక్కల్ ఆంజనేయస్వామికి పుష్పాలంకరణ



పెరంబూర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సంపంగి, చామంతి సహా 10 రకాల పుష్పాలతో ఆంజనేయస్వామికి పుష్పంగి అలంకరణ నిర్వహించారు. నామక్కల్‌లో ప్రసిద్ధిచెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో 18 అడుగుల ఎత్తున స్వామి విగ్రహం ఉంది. ఆలయంలో ప్రతిరోజు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో, గురువారం ప్రాతఃకాలార్చన అనంతరం స్వామివారికి 1,008 వడలతో చేసిన మాల వేశారు. క్షీరాభిషేకం తర్వాత పంచామృతం, పసుపు, వెన్న సహా సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సంపంగి, చామంతి సహా 10 రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో నామక్కల్ సహా చుట్టుపక్కల జిల్లాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన సంప్రదాయ కళా ప్రదర్శన



కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మ్యూజిక్ అకాడమీలో సంప్రదాయం కళల ప్రదర్శన గురువారం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి మాలతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. గ్రామీణ కళలు, వీధి నాటకం, విల్లుపాటు తదితర కళారూపాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా 20 మంది గ్రామీణ కళాకారులకు మేయర్ సుజాత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేలూరు మండల కమిటీ అధ్యక్షుడు నరేంద్రన్, మ్యూజిక్ అకాడమీ సెక్రటరీ మంగ్రై, కోశాధికారి హరిరాజన్ సహా పలువురు ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



వైభవంగా పూల సమర్పణ మహోత్సవం

● మారియమ్మన్ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

ప్యారీస్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమ్మవార్లు కొలువైన దివ్యక్షేత్రాల్లో ప్రధానమైనదిగా గుర్తింపు పొందిన తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయంలో గురువారం పూల సమర్పణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ ఆలయంలో ప్రతి ఏటా మాసిమాసం చివరి ఆదివారం నుండి పంగుణి నెల చివరి ఆదివారం వరకు అమ్మవారికి విశేషపూజలు నిర్వహిస్తారు. ఆ రీతిలో ఈ నెల 9 నుండి ఏప్రిల్ 6వ తేదీ వరకు మాలధారణ చేసిన భక్తులు వ్రతం పాటిస్తారు. ఈ 28రోజులు అమ్మవారికి వండిన వంటలు కాకుండా నారీకేళ జలం, పానకం, ఉప్పులేని మజ్జిగ, చెరకు, పండ్ల రసాలను మాత్రమే నివేదిస్తున్నారు. వ్రతం చేసే రోజుల్లో అమ్మవారి వదనం అలసిపోయినట్లు కనిపిస్తుండటంతో ఆమెను చల్లబరిచేలా గురువారం పూల సమర్పణ వేడుకలు వైభవంగా నిర్వహించారు. 30వ తేదీ అయిన ఆదివారం నిర్వహించనున్న ముగింపు వేడుకల్లో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం అమ్మవారి ఆలయ ప్రధాన ప్రవేశద్వారం నుండి రాజగోపురం వరకు 10 ప్రాంతాల్లో బారిగేట్లు, ఏర్పాటు చేశారు. రద్దీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను స్థానిక పోలీసులు ఏర్పాటు చేశారు.



మోహనకృష్ణన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

డాక్టర్ మోహనకృష్ణన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు

అడయార్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన పెరుంగళత్తూరులోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ)లోని క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఆర్.మోహనకృష్ణన్ బ్యాంకాక్‌లోని యునైటెడ్ నేషనస్ కాన్ఫరెన్స్ ప్రతిష్టాత్మక అవార్డు ప్రదానం చేసింది. క్రీడల ద్వారా శాంతిని బోధించడం, చైతన్య పరిచేందుకు కృషి చేసినందుకు ఎస్‌డీజీ ఇంపాక్ట్ అవార్డు కార్యక్రమంలో దీనిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహనకృష్ణన్ చేసిన అంకితభావం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపుపొందడంతో పాటు ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా నిర్వాహకులు వెల్లడించారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంగ్‌కాక్‌లో ఈ కార్యక్రమం తాజాగా జరిగింది. క్రీడాశక్తి ద్వారా శాంతి, విద్య, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించడంలో గణనీయమైన కృషి చేసిన వ్యక్తులు, సంస్థలను ది ఎస్‌డీజీ ఇంపాక్ట్ సంస్థ గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తుంది.





ఆచార్య సీఎంకే రెడ్డికి సన్మానం - బహుమతులు పొందిన విద్యార్థులు

మంచి ఆరోగ్యానికి నలుగురు వైద్యులు అవసరం

● ఆచార్య సీఎంకే రెడ్డి ● హిందూ కాలేజీలో ఘనంగా ఉగాది సమాపన వేడుకలు

అడయార్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మంచి ఆరోగ్యానికి నలుగురు వైద్యులు అవసరమని, ఆ నలుగురు వైద్యులే డాక్టర్ డైట్, డాక్టర్ ఎక్సర్‌సైజ్, డాక్టర్ పాజిటివ్, డాక్టర్ టేకిట్ ఈజీ అని ఏబీటీఎఫ్ అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి పేర్కొన్నారు. పట్టాభిరాంలోని డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల తెలుగు శాఖ, తెలుగు భాషా సమితి సంయుక్తంగా గురువారం ఉగాది వేడుకల సమాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సీఎంకే రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో ఉపాధ్యాయ, వైద్య వృత్తులు రెండూ ఉన్నతమైనవన్నారు. అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండాలంటే మంచి అలవాట్లను అలవర్చుకుని, ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింకింగ్, సంభాషణా నైపుణ్యం, డిప్లమసీ వంటివి పెంపొందించుకుంటే జీవితంలో ఎలాంటి గడ్డు పరిస్థితులనైనా అధిగమించవచ్చన్నారు. తాను వైద్య అధ్యాపకుడిగా ఇలాంటి అనేక విషయాలను విద్యార్థులకు నేర్పిస్తుంటానని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో శాఖాధ్యక్షుడు డాక్టర్ సురేష్ స్వాగతం పలుకగా, ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ కల్విక్కరసి ముఖ్య అతిథిని సత్కరించారు. ఉగాది వేడుకల్లో భాగంగా, క్షణోత్తరి, పాటల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అశ్విని, బాబు తెలుగు తల్లి ప్రార్థనా గీతంతో ప్రారంభైన కార్యక్రమంలోడాక్టర్ తుమ్మపూడి కల్పన, డాక్టర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.